క్లుప్తంగా

ఆత్మీయ కలయిక


వైఎస్ జగన్‌తో గోపాల్ యాదవ్

కామవరపుకోట / చింతలపూడి : పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం మండలంలోని కంతమనేనివారిగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరుముచ్చు గోపాల్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అధినేతను కలిసినట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన సందీప్


అధినేత జగన్‌తో సందీప్

లింగపాలెం: వైఎస్సార్ సీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ నేత, రాష్ట్ర లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ వేములపల్లి కార్యవర్గం ఎన్నిక


పార్టీ కమిటీని ప్రకటిస్తున్న నాయకులు

లింగపాలెం: మండలంలోని వేములపల్లి గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షులుగా కొల్లి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పార్టీ గ్రామ అబ్జర్వర్, మాజీ సొసైటీ అధ్యక్షుడు రెడ్డిన శ్రీను ఆధ్వర్యంలో వేములపల్లి కమిటీని పార్టీ లింగపాలెం మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు ప్రకటించారు. అధ్యక్షుడిగా కొల్లి శ్రీను, ప్రధాన కార్యదర్శులుగా బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, తోలం విజయ్, బుల్లివరపు రాంబాబు, తాడేపల్లి కృష్ణారావు, కార్యదర్శులుగా బుల్లివరపు నాగరాజు, బండి రాము, నత్త పాపారావు, ఉప్పులూరు సురేష్, చిరి నాగరాజులు ఎన్నికయ్యారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది.

కొండచిలువ కలకలం

కామవరపుకోట: స్థానిక కొత్తూరు సబ్‌స్టేషన్ ఎదురుగా వెళుతున్న కొండచిలువను సోమవారం రాత్రి గ్రామస్తులు గమనించి హతమార్చారు. కొండచిలువ సుమారు 10 అడుగుల పొడవు 15 కేజీల బరువు ఉండొచ్చని, ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కువగా వరద నీరు ప్రవహించటంతో, సమీపంలో గల తోటల నుంచి ఈ కొండచిలువ వచ్చి ఉండవచ్చునని స్థానికులు భావిస్తున్నారు.

ఇన్‌చార్జి ఎంఈఓ-1గా సత్యనారాయణ

ద్వారకాతిరుమల: ఇన్‌చార్జి ఎంఈఓ-1గా ఎం సత్యనారాయణ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గోపన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన ఇక్కడ నియమితులయ్యారు. కార్యాలయానికి విచ్చేసిన సత్యనారాయణకు యూటీఎఫ్ మండల శాఖ ఘన స్వాగతం పలికింది. ఇక్కడ విధులు నిర్వహించిన సుబ్బారావుకు వీడ్కోలు పలికారు.

వాటర్ ఫిల్టర్ బహూకరణ

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్ కల్పవృక్షం వృద్ధాశ్రమానికి వాటర్ ఫిల్టర్‌ను కొయ్యలగూడెంకు చెందిన వ్యాపారి మండా శ్రీనివాస్ మంగళవారం బహూకరించారు. దీనిని రూ.20 వేలతో కొనుగోలు చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాజీ సత్యనారాయణ తెలిపారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీ

కొయ్యలగూడెం: మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ర్యాలీ నిర్వహించారు. బాయ్స్ హైస్కూల్ మీదుగా మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.సతీష్, స్వచ్ఛ భారత ప్రతినిధులు, రాజకీయ నాయకులు, పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లి హైస్కూల్ విద్యార్థినులు ముగ్గురు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు డి.వరప్రకాశం తెలిపారు. గత ఆదివారం ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో టి.రోషిణి హై జంప్‌లో, కె.రమ్యకృష్ణ 600 మీటర్ల పరుగు పందెంలో, కె.ఐశ్వర్య లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈనెల 9 నుంచి 11 వరకు బాపట్లలో జరిగే ఈ అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థినులు ఆడతారని తెలిపారు. వీరిని హెచ్ఎం వరప్రకాశం, సర్పంచ్ టి.సుజాత, ఎస్ఎంసీ చైర్మన్ గోకర్ణేశ్వరరావు, గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం

- రద్దు చేయాలని అఖిలపక్ష పార్టీల డిమాండ్
- సబ్ స్టేషన్ల వద్ద ధర్నాలు


జంగారెడ్డిగూడెం : డీఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం


కామవరపుకోట : ధర్నా చేస్తున్న నాయకులు


చింతలపూడి : ధర్నా చేస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: విద్యుత్ స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని, ట్రూ అప్ చార్జీలు ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా స్థానిక అశ్వరావుపేటరోడ్డులో ఉన్న జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ఎలక్ట్రికల్ డీఈ కార్యాలయ అధికారికి నాయకులు వినతి పత్రం అందజేశారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై అధిక భారం పడడంతో పాటు రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ ఆదాని చేతికి వెళుతుందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ నష్టాలు పూడ్చాలంటే ట్రూ అప్ చార్జి పేరుతో యూనిట్‌కి రూ.3.50 పైసలు వసూలు చేస్తున్నారని, దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత ఘోరమైన భారం ప్రజలపై వేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటీయూసీ, నవ్యాంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు ఎస్‌కే సుభాషిని, సరియం రామ్మోహన్, కేవీ రమణ, సాలి రాజశేఖర్, జంపన వెంకటరమణరాజు, మానుకొండ జీవరత్నం, కుంచే వసంతరావు, జొన్నకోటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కావరపుకోటలో ధర్నా

కామవరపుకోట: స్థానిక విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం వద్ద ముందు సీపీఐ, ఏఐటీయూసీ, బీకేఎంయూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేశారు. స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని ప్రజలకు నాయకులు పిలుపునిచ్చారు. నాయకులు తాడిగడప వెంకట సత్తిరాజు, కంకిపాటి బుచ్చిబాబు, గుమ్మడి లక్ష్మీనారాయణ, కోతాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం

చింతలపూడి : స్మార్ట్ మీటర్లు వద్దంటూ స్థానిక విద్యుత్ ఏడీ కార్యాలయం ముందు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు బైఠాయించారు. నాయకులు పి.పాండురంగారావు, కె.గురవయ్య, రంగనాథ్‌లు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల రైతాంగానికి జరిగే నష్టాలను వివరించారు. విద్యుత్ శాఖ అధికారికి వెయ్యి సంతకాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు పి.సోమశేఖర్, కె.చంద్రశేఖర్ రెడ్డి, దొంతా కృష్ణ, ఎస్‌కే కాలేషా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లాజరు, సులేమాన్, మహిళా సంఘం నాయకురాలు వరలక్ష్మి, అనురాధ, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురంలో భారీ ర్యాలీ

టి.నరసాపురం: స్మార్ట్ మీటర్లు వద్దు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని వామపక్ష పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్లో బహిరంగ సభ నిర్వహించారు. సబ్‌స్టేషన్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు బీఎన్ సాగర్, కొండముచ్చు శ్రీనివాసరావు, బైగాని ఏకాంబరం, ముత్తయ్య, మహంకాళి సుబ్బారావు, తాడిగడప జయరాజు, సీపీఎం నాయకులు గుడెల్లి వెంకటరావు, పూసం సూర్యారావు, మరికొందరు మహిళలు, సీపీఐఎంఎల్ (జనశక్తి) నాయకులు కారం భాస్కర్, కొండా రాము తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడులో..

వేలేరుపాడు: అదాని స్మార్ట్ మీటర్లు వద్దు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు నసించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. వేలేరుపాడు సబ్ స్టేషన్ వద్ద అఖిల పక్షం అధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా చేశారు. స్మార్ట్ మీటర్లు బిగింపు ఆపకుంటే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. సీపీఐ, సీపీఎం, ఎంఎల్ పార్టీ మాస్ లైన్, కాంగ్రెస్ నాయకులు ఎండీ మునీర్, బాడిశ రాము, సాయి బాబు, పిట్టా ప్రసాద్, పిట్టా వీరయ్య, బంధం నాగేశ్వరరావు, బంధం అర్జున్, మడివి కామయ్య, సోడే ప్రసాద్, కురిమల వెంకటేశ్వర్లు, కరటం వెంకటేశ్వర్లు, మడివి దుర్గారావు, ధర్మల రమేష్, సిరికొండ రామారావు, గడ్డాల ముత్యాలరావు, కట్టం రాంబాబు, రత్తమ్మ, విజయ, కొల్లూరి సత్తిపండు, వలగాని సమ్మయ్య, ఇబ్రహీం, సబి, నాయకులు దేశమ్మ, రమాదేవి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో..

కుక్కునూరు: స్మార్ట్ మీటర్లు రద్దు కోరుతూ రామసింగారం సెంటర్ నుంచి సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు కొన్నె లక్ష్మయ్య, కురాకుల బాబూరావు, సోడే నాగేష్, ఎకో సోమరాజు, పూరెం వెంకటేష్, ఎస్కే గౌస్, బాసిన సత్యనారాయణ, కల్లయ్య, మోడియం నాగమణి, యర్సం సాయికిరణ్, గజ్జి రాజులు, వడ్డే రఘు, వరసా నాగేశ్వరరావు, కంటిపల్లి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో..

పోలవరం రూరల్: స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోవాలని, ట్రూ అఫ్ చార్జీలను రద్దు చేయాలని పోలవరం సబ్ స్టేషన్ ముందు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం, రైతు కూలీ సంఘం, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పోరండ్ల శ్రీనివాస్, ఎస్‌కే బాష, కారం భాస్కర్ మాట్లాడారు. విద్యుత్ అధికారికి సంతకాలతో కూడిన వినతి పత్రం అందజేశారు.



కొయ్యలగూడెం : సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం : ధర్నా చేస్తున్న నాయకులు

స్మార్ట్ మీటర్లను విరమించుకోవాలి

కొయ్యలగూడెం: స్మార్ట్ మీటర్లను విరమించుకోవాలని కోరుతూ సీపీఐ, ఏఐటీయూసీ, సీపీఐ ఎంఎల్, న్యూ డెమొక్రసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొయ్యలగూడెం (గవరవరం) విద్యుత్ ఉప కేంద్రం వద్ద ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఏఈ రామారావుకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ, అఖిలభారత రైతు కూలి సంఘం, ఆదివాసి భారత మహాసభ, ఆదివాసి, రైతు కూలి సంఘం నాయకులు తాడిగడప ఆంజనేయరాజు, దుగ్గిరాల నారాయణరావు, లక్క లక్ష్మణరావు, చింతలపూడి దుర్గారావు, పెద్దకాపు, పులపాకుల దుర్గారావు, వి.సద్గురు, కురసం లత, మడకం రామన్న, ఎం రామిరెడ్డి, ఎల్.దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో..

బుట్టాయగూడెం: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. నాయకులు ధర్ముల సురేష్, తెల్లం రామకృష్ణ, బేతి కిషోర్, తగరం బాబూరావు, కట్టా వీరాస్వామి, వెట్టి భారతి, సముద్రాల చంద్రరావులు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లను విరమించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఏఈ శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేశారు. నాయకులు కెచ్చెల పోతురెడ్డి, గుజ్జా రమేష్ బాబు, జలపాల రావు, తామా ముత్యాలమ్మ, పాయం మూకరాజు, తదితరులు పాల్గొన్నారు.


టి.నరసాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


వేలేరుపాడు : ధర్నా చేస్తున్న అఖిలపక్షం సభ్యులు


కుక్కునూరు : సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం



పోలవరం రూరల్ : సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

షాపులకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి


సమావేశమైన నాయీ బ్రాహ్మణులు

జంగారెడ్డిగూడెం: ఎన్నికల సమయంలో నాయీ బ్రాహ్మణ బార్బర్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని అమలు చేయాలని నాయీబ్రాహ్మణులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నెలవారీ సమావేశం స్థానిక నాయీ బ్రాహ్మణ కమిటీ హాల్‌లో అధ్యక్షుడు తాడి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సంఘం చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు చిప్పాడ నరసింహారావు మాట్లాడుతూ బార్బర్ షాపులకు గత ప్రభుత్వం 150 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేసిందని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని 13 నెలలు కాలం గడుస్తున్నప్పటికీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం గౌరవ అధ్యక్షులు, సలహాదారులు కంకిపాటి సత్యనారాయణ, ఎస్ ఆనంద రావు, వల్లూరి వెంకట్ పుప్పాల కృష్ణ, మల్లవరపు నాగపాసు, ఉపాధ్యక్షులు కోడూరి మురళి, సెక్రటరీ కొప్పుల రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ నడింపల్లి బంగారు నాగు, యూత్ అధ్యక్షులు శిలరపు ప్రశాంత్ రాజ్, కార్యవర్గ సభ్యులు మలువలస సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి


కార్యక్రమంలో పాల్గొన్న గిరిజన సర్పంచ్‌లు

బుట్టాయగూడెం: గత 7 నెలలుగా గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని గిరిజన సర్పంచ్‌లు బన్నే బుచ్చిరాజు, తెల్లం రాముడు, ఉయికే బొజ్జిలు తెలిపారు. మంగళవారం సాయంత్రం వారు విలేకర్లతో మాట్లాడుతూ సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో జరిగిన కార్యక్రమంలో గిరిజన సర్పంచ్‌లు పాల్గొన్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేయకపోవడం వల్ల పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టలేక పోతున్నామని తెలిపారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన మహిళా సర్పంచ్‌లు తెల్లం వెంకాయమ్మ, సరియం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ఖర్చుల ఆదా


కామవరపుకోట : తడికలపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ముత్యాలరావు


చింతలపూడి : యర్రంపల్లిలో మాట్లాడుతున్న ఏడీ సుబ్బారావు

కామవరపుకోట: సేంద్రియ వ్యవసాయంతో ఖర్చు తగ్గి రైతులు అధిక లాభాలు పొందవచ్చునని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ముత్యాలరావు అన్నారు. మండలంలో మంగళవారం కామవరపుకోట, తడికలపూడి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఉపకరణాలు కషాయాలు, వంటి వాటిని వ్యవసాయంలో వినియోగించడం ద్వారా భూమి సారవంతం అవుతుందని, ఖర్చు తగ్గుతుందని తద్వారా నాణ్యమైన దిగుబడులు వస్తాయని, నికర ఆదాయం ఎక్కువగా మిగులుతుందని ఏఓ వివరించారు. తడికలపూడి గ్రామంలో రైతులతో కలిసి కొబ్బరి, కోకో పంటను పరిశీలించారు. పూత, పిందకాయ నిలబడటానికి కోడిగుడ్డు, నిమ్మరసంతో కషాయం తయారు చేసి రైతులకు చూపించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి, గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బంది, ప్రకృతి సేద్య సిబ్బంది గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు చేసుకోండి

చింతలపూడి : సబ్ డివిజన్‌లోని ప్రతి రైతూ ఈ పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వై.సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. చింతలపూడి మండలం ఎర్రంపల్లి, తిమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రతి కౌలు రైతు కౌలు గుర్తింపు కార్డు పొందాలని, అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులు అయి ఉండి, డబ్బులు పడకపోతే రైతు సేవ కేంద్రాల్లో ఫిర్యాదు చేయాలని సుబ్బారావు సూచించారు. కార్యక్రమంలో ఏఓ మురళీకృష్ణ, ఉద్యాన అధికారి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం మండలంలో..

కొయ్యలగూడెం: పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం అచ్యుతాపురం పొంగుటూరు గ్రామాల్లో నిర్వహించారు. నానో యూరియా, డీఏపీల వినియోగంపై ఏఓ పోసారావు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు ఈ పంట నమోదు, ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. రైతులకు ఉన్న సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.

లింగపాలెం మండలంలో..

లింగపాలెం: మండలంలోని కలరాయనగూడెం, మఠంగూడెంలలో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార పంట బీమా పథకం పీఎంఎఫ్‌బీవైలో ప్రతీ రైతు బీమా చేయించుకోవాలన్నారు. పంటలకు అతిగా ఎరువులు వాడవద్దన్నారు. నానో యూరియా, నానో డీఏపీని వాడాలన్నారు. ముసునూరి రాంబాబు, నందిగం శ్రీధర్, తూంపాటి కిషోర్, మందలపు వెంకట సుబ్బారావు, ఆర్ఎస్‌కే ఇన్‌ఛార్జ్ ఎండీ ఆయేషా సిద్దిఖీ, ఎస్.మానస పాల్గొన్నారు.

ఇటికలకోటలో..

పోలవరం రూరల్: పోలవరం మండలం ఇటుకలకోటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుజ్జిబాబు మాట్లాడుతూ ప్రతి వారి పంటలను ప్రధానమంత్రి పసల భీమా యోజన పథకం కింద క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకుని, ప్రీమియం చెల్లించాలన్నారు. వరిలో వచ్చే కాండం కుళ్లు, వేరుకుళ్లు తెగుళ్ల నివారణకు ట్రైకోడెర్మా విరిడిని 10 కేజీల పశువు పెంటలో కలిపి వారం రోజులు నీడ ప్రదేశంలో మగ్గనిచ్చి పొలంలో చల్లాలన్నారు. భూమిలో నిర్జీవంగా ఉన్న బాశ్వరం ఎరువును ఫాస్ఫేట్ సాల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా లీటర్ మందును 10 కేజీల పశువుల పెంటలో కలిపి వారం రోజులు మగ్గనిచ్చి పొలాల్లో చల్లాలని సూచించారు. ఈ రెండు మందులు ప్రతి రైతు సేవా కేంద్రంలో 50 రాయితీపై రైతులకు అందిస్తున్నట్టు చెప్పారు.

జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్లు ఇవ్వాలి


ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం


చింతలపూడి ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్లు వెంటనే మంజూరు చేయాలని, ప్రమాద బీమా పాలసీ పునరుద్ధరించాలని ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జంగారెడ్డిగూడెంలో జర్నలిస్ట్ డిమాండ్ డే నిర్వహించారు. యూనియన్ సభ్యులు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డివిజనల్ పరిపాలనాధికారి గొట్టుముక్కల నాగచంద్రశేఖర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డీవీ భాస్కరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 16 నెలలు కావస్తున్నప్పటికీ నూతన అక్రిడిటేషన్లను మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల హామీలను నెరవేర్చాలి

చింతలపూడి : ఎన్నికల్లో జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కే అజాద్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ నజీముల్లా షాకు వినతి పత్రం అందజేశారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్ సతీష్, పాత్రికేయులు కేఎస్ఎస్ వీరయ్య, షేక్ అమీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై వినతి

కామవరపుకోట: కామవరపుకోట ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు తమ సమస్యలపై తహసీల్దార్ ఎలీషాకు అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వీరమల్లు మధుసూదన్‌రావు, కోశాధికారి వుయ్యూరు శుభాష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు సమస్యలపై వినతిపత్రం

కొయ్యలగూడెం: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ ఎస్ నాగరాజుకు కొయ్యలగూడెం ఏపీడబ్ల్యూజే వర్కింగ్ జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు. అక్రెడిటేషన్ కొత్త కార్డులు ఇవ్వడం లేదని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని నాయకులు కోరారు.

డ్రోన్ నిఘా

ద్వారకాతిరుమల: శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు డ్రోన్ నిఘా వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుందని సీఐ యుజే విల్సన్ అన్నారు. ద్వారకాతిరుమలలోని పలు బహిరంగ ప్రదేశాల్లో మద్యపానాన్ని అదుపు చేసేందుకు, అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు ఎస్సై టి.సుధీర్‌తో కలసి మంగళవారం సాయంత్రం ఆయన డ్రోన్ సహాయంతో నిఘా కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలు సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు నిరంతరం నిఘా కొనసాగుతుందని, పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు.

హామీలు అమలు చేయని ప్రభుత్వం

వేలేరుపాడు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏడాది పూర్తయినా కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు విమర్శించారు. ఆ పార్టీ స్థానిక మండల సమావేశంలో వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టాలని కోరారు.